## ఉపాధి హామీ పథకాన్ని కూలీలు వినియోగించుకోవాలి

### ఎంపిడీఓ గంగుల సంతోష్ కుమార్



భీమ్ గల్, బతుకమ్మ :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని గ్రామకూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ కోరారు. గురువారం ఆయన మండలంలోని మెండోరా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాలకు నల్ల మట్టి సరఫరా పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం పూట పనులు ముగించుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు నీటి సదుపాయం ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీ కుంట లక్ష్మి రమేష్ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జీ.నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ స్వామిదాస్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఉప సర్పంచ్ కుంట రమేష్ ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



## పదిలో మెరిసిన ఆణిముత్యాలకు ప్రతిభకు పురస్కారాలు



వేల్పూర్, బతుకమ్మ :ఆర్మూర్ డివిజన్ స్థాయిలో పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటిన ఆణిముత్యలైన విద్యార్థులను బడ్జెట్ స్కూల్స్ అసోసియేషన్ తెలంగాణ (నిజామాబాద్ జిల్లా విభాగం) గురువారం ఘనంగా సత్కరించింది. స్థానిక అనిల్ బ్లాంకెట్ హాల్ లో నిర్వహించిన ఈ వేడుకలో డివిజన్ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు . 576 మార్కులతో డివిజన్ టాపర్గా నిలిచిన కమ్మరపల్లి మిసిమీ హైస్కూల్ కు చెందిన విద్యార్థిని జె. శాలిని ప్రథమ బహుమతి పొందగా , 575 మార్కులతో మోర్తాడ్ నవోదయ పాఠశాలకు చెందిన విద్యార్థిని తాంజీలా ఆఫీన్ ద్వితీయ బహుమతిని, 572 మార్కులతో వెల్లటూర్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని మహిత తృతీయ బహుమతులను గెలుచుకొని, పురస్కారాలు అందుకున్నారు. వీరితో పాటు ఆయా పాఠశాలల టాపర్లుగా నిలిచిన మరో 19 మంది విద్యార్థులకు అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఫౌండర్ డాక్టర్ షఫీ, జిల్లా అధ్యక్షులు నంబుల గిరి లు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలని, అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు . ఈ వేడుకలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## 42 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండలంలోని జేయన్సీ కాలనీలో షరీఫ్ ఉద్దీన్ ఇంట్లో పిడీఎస్ బియ్యం నిల్వ ఉంచారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న 42 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీన పర్చుకుని షరీఫ్ ఉద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న వెల్లడించారు.



# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

### యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, ఎమ్మెల్యే పిలుపు







నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా టాస్క్ సౌజన్యంతో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిజామాబాద్, కామారెడ్డి లతో కూడిన ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. 71 కంపెనీల ద్వారా సుమారు 2000 మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయని నిర్వాహకులు ప్రకటించారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి తదితరులు విచ్చేసి, జాబ్ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. సుమారు రెండు వేల మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, మరికొందరికి అప్రెంటిస్ షిప్ ద్వారా శిక్షణ కోసం ఎంపిక చేశారని అన్నారు. ఈ తరహా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అందుకు గాను స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పు గంగారెడ్డి, డివైఎస్ఓ పవన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఎన్ఐసీ అధికారి మధు, ఈ-డీఎం కార్తీక్, వంశీధర్ రెడ్డి, టాస్క్ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే వేతనాలు నిలిపివేస్తాం

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలు తీరు,పై కలెక్టర్ గురువారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలును పరిశీలిస్తూ, పనితీరులో వెనుకంజలో ఉన్న ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడం వల్ల నిజామాబాద్ జిల్లా సగటుపై ఇది ప్రభావం చూపుతోందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఓలతో మ్యాపింగ్ ను పక్కాగా జరిపించాలని, రోజువారీగా నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలులో పురోగతిపై తాను వారం రోజుల తర్వాత మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. స్పష్టమైన పురోగతి కనిపించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, వారి వేతనాలు నిలిపివేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనితీరు సక్రమంగా లేని ఇద్దరు ఆర్.పీలకు షోకాజ్ నోటీసులు అందించి విధుల నుండి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన అనుమతి లేకుండా బీఎల్ఓల మార్పులు, చేర్పులు చేయకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు, చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉండరాదని, అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదని అన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం చేపట్టిందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకునేలా చూడాలని, మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కోసం వారి సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమరణ ప్రక్రియ చేపట్టడం వల్ల ఓటరు జాబితాలో నిజమైన ఓటరు ఖచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన, రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఎవరూ అపోహకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత ఎవరైనా ఓటు హక్కు రాని వారు ఉంటే ఆక్షేపణ చేయవచ్చని అన్నారు. సమీక్షలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కూలీలకు రావాల్సిన డబ్బులను వెంటనే ఇప్పించాలి

### ఐద్వా జిల్లా కార్యదర్శి బెజ్జం సుజాత





నవీపేట్, బతుకమ్మ :ఉపాధి హామి కూలీలకు ఫిబ్రవరి 5 నుంచి ఇప్పటి వరకు కూలీ డబ్బులు రాలేదని, వాటిని వెంటనే ఇప్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బెజ్జం సుజాత అన్నారు. నవీపేట్ మండల్ దర్యాపూర్ గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సుజాత మాట్లాడుతూ ఉపాధి హామి కూలీలకు కనీసం మౌలిక సదుపాయాలు లేవన్నారు. మంచి నీరు, టెంటు, మెడికల్ కిట్టు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని, వీటిని వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ సెక్రటరీ రవీందర్ నాయక్ కి వినతి పత్రం అందించారు. సెక్రటరీ స్పందించి మంచి నీరు, మెడికల్ కిట్టు లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ కి చెప్పామని అన్నారు. కానీ ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల కూలీలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి రమాదేవి, కమిటీ సభ్యులు సావిత్రమ్మ స్వరూప, షమీం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ పి.వసంత్, సిఐటియు జిల్లా నాయకులు నాయక వాడి, శ్రీను పాల్గొన్నారు.